# నా కథారచన

కొడవటిగంటి కుటుంబరావు

నేను కథలు రాయటానికి పుట్టా ననుకోవటానికి ఆధారాలు లేవు. పదోఏట ఒక స్నేహితుడికి తొమ్మిది రోజులపాటు తరగని కథ ఒకటి చెప్పాను, పదమూడోఏట తలా తోకా లేని డిటెక్టివు నవల, ముందువాక్యంలో ఏమి రాస్తానో నాకే తెలియకుండా, కొంత రాశాను, నిజమే. దాన్నిబట్టే నేను కథలు రాయటానికి పుట్టినవాణ్ణికానని ఎవరన్నా సందేహించవచ్చు. ఈ విషయం నా పదిహేడోఏట గట్టిగా రుజువయింది. నేను ఇంటరు చదువుతూండగా కథ రాయాలని "నిజంగా" ప్రయత్నించే సరికి నా అశక్తత చూసి నాకే ఆశ్చర్యం కలిగింది.

"కథ రాయటం నిజంగా ఇంత కష్టమైతే కథలు రాసేవాళ్ళు—చచ్చుకథలు రాసేవాళ్ళు కూడా—చాలా గొప్పవాళ్ళే", అనుకున్నాను. ఎందుచేతనంటే నా బుర్రలో ఒక్క సన్నివేశం స్ఫురించలేదు, స్ఫురించినదాన్ని వాక్యాలలో పెట్టటానికి మాటలే ఉన్నట్టు కనిపించలేదు.

"కథలు రాయాలంటే ఏంచెయ్యాలి ?" అని అడుగుదామన్నా నే నేకథకుణ్ణీ ఎరగను.

"నా కిది సాధ్యమయ్యే పని కాదు", అని రుజువు చేసుకునేటందుకే నేను పని పెట్టుకుని దీక్షగా డజన్లకొద్దీ కథలు రాసి చించి పారెయ్యసాగాను. ఈ కృషి శిల్పం అలవరచుకోవటానికి పనికివచ్చింది. అనేక ఏళ్ళపాటు నేను కథలు రాయటంలో శిల్పాన్ని తప్ప మరేమీ లక్ష్యపెట్టలేదు.

మొదటినుంచీ నాకు నేనే విమర్శకుణ్ణి. నా కథలు పత్రికలలో పడటం ఆరంభమైన తరవాత కూడా మా తమ్ముడు కృష్ణమూర్తికి తప్ప ఇంకెవరికీ నేను కథలు రాస్తున్నానని తెలియదు.

నే నిట్లా దాగి ఉండటానికి కారణం ఉంది. తెలుగుపత్రికల్లో పడే కథలూ ఇంగ్లీషు పత్రికల్లో పడే కథలూ చదివి పోల్చిచూస్తే తెలుగు కథకులు ఇటువంటి కథలు ఎందుకు రాస్తారా, పత్రిక లెందుకు వేస్తాయా అనిపించేది. శిల్పంలో బాగా చెయ్యి తిరిగి కథనంలో కొంత సామర్థ్యం చేకూరేవరకూ అజ్ఞాతంగా ఉండటమే మంచిదనిపించింది. మొట్టమొదటిసారి పత్రికలో అచ్చయిన నాకథ "ప్రాణాధికం". దాన్ని శ్రీ ఆంధ్ర శేషగిరిరావుగారు "గృహలక్ష్మి"లో అచ్చువేయటమే కాకుండా ఆనెల ప్రకటితమైన కథలలో అగ్రస్థానం ఇచ్చినా నాభయం తీరలేదు. కథారచనలో శ్రీ ఆంధ్ర శేషగిరిరావుగారు నాకిచ్చిన ప్రోత్సాహం అంతా ఇంతా కాదు.

కొత్తగా కథలు రాయటం ఆరంభించినవారు నామాదిరిగా శిల్పానికి ప్రాముఖ్యం ఇవ్వటం నా కభ్యంతరం లేదు గాని, నామాదిరిగా సాంఘిక ప్రయోజనాన్ని తృణీకరించమని మటుకు సలహా ఇవ్వను.

నాకథల్లో అప్పట్లో ఏప్రయోజనమూ లేదని కాదు. జీవితంలో నేను చూసిన మనస్తత్వాలలోని లోపాలు విమర్శిస్తూ పాత్రలను సృష్టిచేసి "కుటుంబరావు పాత్రపోషణలో అద్వితీయ ప్రతిభ చూపుతున్నాడు" అన్నమాట కూడా సంపాదించాను. కాని నే నవలంబించిన వ్యక్తివాదంవల్ల నా ప్రయోజనం కొనసాగిందేమో గాని సాంఘికప్రయోజనం నా కథల్లో మృగ్యమయింది. ఈ కాలంలో సాంఘిక స్వరూపాన్ని గురించిన విజ్ఞానం ప్రజలలో బాగా వ్యాప్తిచెందింది. వ్యక్తుల దుర్భావాల వల్లనే సంఘం అధోగతిలో ఉందనీ, అవి మారితే ఇదీ మారుతుందనీ ఈ నా డెవరూ భావించనవసరం లేదు. ఆర్థిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మనః ప్రవృత్తు లుంటాయనేది ఈనాడు అందరూ సులభంగా గ్రహించవచ్చు.

శిల్పంమీద దృష్టి కేంద్రీకరించటం వల్ల నాలో చాలా దురలవాట్లు కలిగాయి. మొదటిది, ఏ విషయం తీసుకుని అయినానకే కథ రాసే

య్యటం; రెండోది, అచ్చయిన కథలను గురించి పట్టించుకోకపోవటం (నేను రాసిన కథల కటింగులు కూడా ఎన్నడూ దాచిపెట్టుకో లేదు—ఈ విధంగా నాపాతకథలు వందకుపైగాపోయాయి). మూడోది, రాసుకున్నది తిరిగి చూసుకోకపోవటం. నాలుగోది, ఎన్ని కథలు రాసినా, వాటిని ఎంతమంది మెచ్చుకున్నా తృప్తి లేకపోవడం; వాటి నెవరైనా తిడితే ఈగవాలినట్టు కూడా లేకపోవటం... ఆసక్తిగల కథకుడికి ఉండదగిన లక్షణాలు లేవు.

దీనికితోడు ఇంకొక ఆలోచనకూడా నన్ను బాధించసాగింది. నే నెప్పుడూ బుద్ధి పూర్వకంగా ఇతి వృత్తాలు "చేతివాటు" వేయలేదు. కాని నేను రాసే కథల్లో ఇంగ్లీషు సాహిత్య ప్రభావంలేదా? అవి ఇంగ్లీషు కథలకి తర్జుమాలు కాకపోవచ్చు గాక; అయిఉండే అవకాశం లేదా? నాకథల్లో ఏ కథన్నా తీసుకుని "ఇది తెలుగువాడు తప్ప రాయలేడు; తెలుగు వాళ్లలోకూడా నేను తప్ప ఇంకెవరూ రాసి ఉండటానికి వీల్లేదు" అనుకోవటాని కుందా? లేదు!

"తాతయ్య" అనే కథ రాసి చాలా గొప్ప పని చేసినట్టు సంతోషించాను. నాకథ చూసి నాకు తృప్తికలగటం అదే మొదటిసారి. ఆ కథను తెలుగువాడు తప్ప రాయలేడు, తెలుగు వాళ్ళలోకూడా నేను తప్ప మరొకరు రాసే అవకాశం లేదు. "తాతయ్య" రాసేనాటికి నేను కథారచన ఆరంభించి పదేళ్ళయింది! ఆ కథతోనే నేను ఊహాప్రపంచంనుంచి వాస్తవిక ప్రపంచంలోకి రావటం మొదలు పెట్టాను. ఈ రావటం పూర్తి కావటాని కింకా రెండేళ్లు పట్టింది. ఈ మార్పు కంతకూ యుద్ధం చాలా తోడ్పడింది.

రచయితలకు బిడియాలు (ఇన్‌హిబిషన్స్) ఉండరాదు. బిడియాలు అభివృద్ధి నిరోధకాలు. నేను చాలా బిడియాలతో యుద్ధం చేసినవాణ్ణి కనక ఈ విషయం గట్టిగా చెప్పగలను. కళ్ల ఎదురుగా కనిపించే జీవితాన్ని కథల్లోకి ఎక్కించటానికి నాకు బిడియంగా ఉండేది. నా కళ్లఎదుట కాంగ్రెసు ఉద్యమాలూ, లాఠీ ఛార్జీలూ జరిగితే వాటినిగురించి నేను రాయలేదు. దారిద్ర్యం నన్ను వేధిస్తున్నరోజుల్లో నేను ప్రణయ కథలు రాశాను. డబ్బుకోసం రాసుకునే జర్నలిస్టులు తప్ప కళారాధకులు ప్రజల కెదురుగా ఉండే విషయాలనుగురించి రాయగూడదనీ, ప్రజలందరికీ ఉండే విశ్వాసాలను బలపరచ కూడదనీ అనిపించేది. కాంగ్రెసును గురించి రాసిన రెండు కథల్లోనూ కపట కాంగ్రెసు వాదులను అవహేళన చేశానుగాని కాంగ్రెసు ఉద్యమం ప్రజలలో రేకెత్తించిన ఉత్సాహాన్ని బలపరచలేదు. అట్లాగే తాగుడు గురించి రాసిన ఒక్క కథలోనూ తాగుడుకు విరుద్ధంగా ప్రచారం చేసే వాళ్లని అవహేళన చేశాను. "అవతలి" వేపుఉండే సత్యాన్ని అన్వేషించటంలో ఉండే ఉత్సాహం నాకు "ఇవతలి" వేపు సత్యాన్ని బలపరచటంలో ఉండేది కాదు. ఇది చాలా నిష్ప్రయోజనకారి అని నేను ఈనాటి కథకులకు వేరే తెలియజెప్ప నవసరం ఉండదు.

సామ్యవాదమూ, సోషలిజమూ, కమ్యూనిజమూ, డయలెక్టికల్ మెటీరియలిజమూ, మార్క్సిజమూ అనేమాటలు నన్ను చుట్టుముట్టి నప్పుడుకూడా నేను వాటినిగురించి సరిఅయిన అభిప్రాయాలు సంపాదించటానికి ప్రయత్నించనే లేదు. జీవితం నాకు అయోమయంగా కనిపించింద. ఆ అయోమయత్వం జీవితంలో స్వతస్సిద్ధంగా ఉందనే విశ్వాసంతో దాన్ని కూడా కథలలో పెట్టాను. వాటిని తీవ్రంగా విమర్శించినవారు లేకపోవటం నా దురదృష్టం.

కాని జీవితమూ కళలూ కూడా నిత్యమూ కలిగించే అసంతృప్తి నుంచి బయట పడటానికి ఎన్ని ప్రయత్నాలన్నా చేయవలసి వచ్చింది—మార్క్స "కాపిటల్" చదవటంతో సహా. మార్క్సిజం గురించి చదవటం నాకు చాలా మేలు చేసింది. సంఘవ్యాధిని గురించి నేను కొంత అర్థం చేసుకోగలిగాను. కాని అది కూడా ముఖ్యమైన విషయం కాదు. నా మాదిరిగా కథలు రాసుకునేవాడికి ముఖ్యమైన సంగతేమంటే, కథలవల్ల సాధించదగిన సాంఘిక ప్రయోజనం గురించి అంతో ఇంతో స్పష్టమైన అభిప్రాయా లేర్పడటం.

ఈపాటి జ్ఞానోదయం కలగగానే నేను చేసిన మొదటి రచన "కులంగాడి అంత్యక్రియలు."

ఆటుతరవాత రాసిన కథల్లో మనస్తత్వం గురించి గాలి కబుర్లు రాయటం మానేసి ఆ మనస్తత్వాన్ని ఆడించే సాంఘిక శక్తులనుకూడా చిత్రించటం మొదలు పెట్టాను. "నీ కథలు వెనక ఉన్నట్లుగా లేవు. అవే బాగున్నాయి," అని కొందరు అభిమానులు నన్ను హెచ్చరించసాగారు...

నేను అభ్యుదయ వాదిని. సాహిత్యంద్వారా మనుష్యులు ఉత్తేజితు లవుతారనీ, జీవితాన్ని అర్థం చేసుకోగలుగుతారనీ, వారి భావాలు ముందుకు పోతాయనీ నా దృఢవిశ్వాసం.

ఐతే నేను మధ్యతరగతి సంస్కారం గలవాణ్ణి. ఈ సంస్కారంతో నేను అభ్యుదయ రచనలు చేయగలనుగాని ప్రజాసాహిత్యమూ, శ్రామిక వర్గ సాహిత్యమూ సృష్టి చేయలేను. అందుచేత నా రచనలు ప్రజాసామాన్యాన్నీ, శ్రామికులనూ ఉత్తేజ పరచలేవు. కాని మధ్యతరగతి వారిలో ప్రజాజీవితానికి అనుకూలించే పరివర్తన తేచ్చే అవకాశం ఉంది. ఈ పని ఎంత విజయవంతంగా చెయ్యగలిగితే నేనంత ఉత్తమ కథకుణ్ణి అనిపించుకుంటాను.

ప్రజాస్వామ్యం

# నేటి కాలపు గేయకవిత్వం

'రౌహిణేయ'

గేయ కవిత్వరచన చాలా అధునాతనమయింది మన ఆంధ్రదేశంలో. ఆంగ్ల సారస్వతం యొక్క పరిచయం మనగేయ రచనకు కొంత ప్రోత్సాహం ఇచ్చింది. అంటే అంతకు పూర్వం మనకు గేయాలు లేవని కాదు. దేశమంతటా వివిధములైన గేయాలు వ్యాప్తిలో ఉంటూనే వచ్చాయి. అవి మధురములు, ఆహ్లాదకరములు అయినా, వాటికి ఆనాటి కవుల, పండితుల ఆదరణ లభించినట్లు కనిపించదు. పూర్వపు కవులు గేయరచన తలపెట్టనే లేదు. ఏ సామాన్య విద్యావంతుడో, లేక రసహృదయుడైన గ్రామీణుడో స్వప్రతిభతో ఆ గేయాలను రచించేవాడు. గ్రామీణులు తమ సహజమృదులస్వరంతో, నిర్మలానంద పరిపూర్ణమయిన హృదయంతో ఆగేయాలను పాడి వాటికి జీవం పోసేవారు. ఆనాటి కవులకు వీటియందు శ్రద్ధ లేకపోయింది. చిత్రకవిత్వాలు, బంధ కవిత్వాలు అల్లడంతో కొందరు, వాదనలలో 'ప్రతివాది భయంకర' బిరుదాన్ని సంపాదించాలనే కోర్కెతో కొందరు, నానా రససంపన్నములయిన మృదు మధుర ప్రబంధ రచనలతో కొందరు, తమ ఆశు కవితాధారల్లో రాజుల హృదయాలను ఉక్కిరిబిక్కిరి జేసి బహుమతుల నందుకోవటంలో మరికొందరు తమ జీవితాలను గడిపివేశారు. ఆనాటికి వారికి ఆ పద్ధతులు తగియుండినాయి.

వారి కవిత్వాలలో విరహ వేదనవల్ల కలిగిన ఆర్తారావాలు తప్ప,మరేవిధమైన ఆర్తారావాలు, దీనవిలాపాలు కనిపించవు. దేవతలు, రాజులు తప్ప మరియొకరికి ఆనాటి కవిత్వంలో తావు లేకపోయింది. ఏ పురాణంలోనో ఉన్న ప్రమాణిత ఇతివృత్తం తప్ప వేరే కథావస్తువు ఆకాలంలో అపరిగ్రహం అయింది.

అయినా కవిత్వంలో మార్పులు జరుగక తప్పలేదు. ప్రథమంలో నన్నయాచార్యుడు తెలుగువ్యాకరణం సంస్కృతంలో రచించడంతో ప్రారంభమయిన ఆంధ్రవాఙ్మయం కృష్ణరాయల కాలంలో అన్ని విధముల దశదిశల తన కీర్తి చంద్రికల వ్యాపింపజేసికొని, "ఆద్యసత్కథల్ వావిరిబుట్టు రత్నములు" అని భట్టుమూర్తి